క్లుప్తంగా

పొదిలిలో ట్రాఫిక్ తంటాలు



రామాలయం వద్ద రోడ్డులో నిలిపిన వాహనాలు

పొదిలి: పొదిలి పట్టణంలోని ప్రధాన రహదారి తోపాటు ఇతర మార్గాల్లో ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతోంది. విశ్వనాథపురంలోని కాలేజీ రోడ్డులో వాహనాలు అడ్డగోలుగా పార్కింగ్ చేస్తుండటంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. సాయంత్రం వేళ ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటోంది. రామాలయం, బ్యాంకుతోపాటు దుకాణాలు ఉన్న నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొమరోలు: ఆర్‌డీఎస్ఎస్ పనుల నేపథ్యంలో మండలంలోని హనుమంతరాయునిపల్లె, కసినేపల్లె, గోహరపల్లె, కొత్తపల్లె, ఓబులాపురం, మలికేపల్లె, కూరాకునివానిపల్లె, చింతలపల్లె, వర్ధనపల్లె గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. వినియోగదారులు గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని గురువారం ఓ ప్రకటనలో కోరారు.

బహిరంగంగా మద్యం తాగితే చర్యలు



మద్యం సీసాలు తొలగిస్తున్న కార్మికులు

కొమరోలు: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తప్పవని కొమరోలు ఎస్సై నాగరాజు హెచ్చరించారు. మండలంలోని పలు ప్రాంతాల్లో బహిరంగంగా మద్యం తాగి రచ్చ చేయడం, సీసాలను ఎక్కడపడితే అక్కడ ధ్వంసం చేస్తున్న నేపథ్యంలో కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కొమరోలు పరిసర ప్రాంతాల్లో మద్యం తాగుతున్న ప్రదేశాలను పోలీసు సిబ్బంది పరిశీలించారు. అక్కడ పడి ఉన్న ఖాళీ మద్యం సీసాలు, గ్లాసులను స్థానిక పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయించారు.

కెరీర్ అండ్ మెంటల్ హెల్త్‌పై అవగాహన



మాట్లాడుతున్న పద్మావతి

కొనకనమిట్ల: కెరీర్ అండ్ మెంటల్ హెల్త్‌పై మండలంలోని మర్రిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కెరీర్ అండ్ మెంటల్ హెల్త్ కౌన్సిలర్ గుమ్మా పద్మావతి మాట్లాడుతూ.. విద్యార్థుల్లో మనోవికాసం పెంపొందించేందుకు మెడిటేషన్, యోగా, ఫిజికల్ యాక్టివిటీస్, సోషల్ కమ్యూనికేషన్, సెల్ఫ్ డిసిప్లిన్, నైతిక విలువలు, అగ్రెసివ్ బిహేవియర్, మొబైల్ ఫోన్ అడిక్షన్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. హెచ్ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయుడు రామాంజనేయులు పాల్గొన్నారు.

వృద్ధ దంపతుల సమస్య పరిష్కారం



చెక్కు అందిస్తున్న తహసీల్దార్ చిరంజీవి

మార్కాపురం: మార్కాపురం మండలం రాయవరానికి చెందిన తమ్మిశెట్టి పెద్దన్న 11 ఏళ్లగా పోరాడుతున్న సమస్యను పరిష్కరించినట్లు తహసీల్దార్ చిరంజీవి తెలిపారు. పెద్దన్న ఈనెల 8వ తేదీన సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద తనకు రావాల్సిన కూలీ డబ్బులపై నిరాహార దీక్ష చేపట్టారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ చిరంజీవి పలకల క్వారీ యజమానులైన వి.ప్రసాద్, సుబ్బారావుతో మాట్లాడి పెద్దన్నకు రావాల్సిన 2,10,505 రూపాయల మొత్తాన్ని ఆర్ఆర్ చట్టం ద్వారా రికవరీ చేసి అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎమ్మార్వో శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

పొదిలి: స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ ఆధ్వర్యంలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు కార్యాలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. డిపో పరిధిలోని బస్సు సర్వీసులకు సంబంధించి సూచనలు, సలహాలు, ఇతర సమస్యలను డీఎం దృష్టికి తీసుకరావచ్చని పేర్కొన్నారు. సాయంత్రం 4–5 గంటల మధ్యలో 9959225700కు ఫోన్ చేయాలని సూచించారు.

మెడికల్ కాలేజీ ప్రైవేటీకరణ

అనాలోచిత నిర్ణయం

- జగనన్నకు ఎక్కడ మంచిపేరు వస్తుందోనని కూటమి సర్కారు పన్నాగం
- మార్కాపురంలో తరగతుల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినా సైంధవుడిలా అడ్డుతగిలారు
- పేద విద్యార్థులు డాక్టరయ్యే అవకాశాన్ని కాలరాయాలనుకోవడం దుర్మార్గం
- పార్టీ శ్రేణుల సమావేశంలో వైఎస్సార్ సీపీ గిద్దలూరు ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి ధ్వజం
- నేడు చలో మెడికల్ కాలేజీని విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులు, యువజన సంఘాలకు పిలుపు



మాట్లాడుతున్న కేపీ నాగార్జునరెడ్డి

గిద్దలూరు రూరల్: ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించేందుకు అన్ని అవకాశాలు పుష్కలంగా ఉన్న మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో ప్రైవేట్ పరం చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధం కావడం అత్యంత దుర్మార్గమైన చర్య అని వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి విమర్శించారు. వందల కోట్ల రూపాయల విలువైన భూములతోపాటు కాలేజీ భవనాలను కారుచౌకగా టీడీపీ సానుభూతిపరులకు కట్టబెట్టే యత్నాన్ని సీఎం చంద్రబాబునాయుడు తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరం చేయాలన్న అనాలోచిత నిర్ణయాన్ని రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా కూటమి సర్కారు ముందుకెళ్లడాన్ని తప్పుబట్టారు. గురువారం గిద్దలూరు పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో యువజన విభాగం, విద్యార్థి విభాగం నేతలతో ఏర్పాటు చేసిన సమావేశంలో కేపీ నాగార్జునరెడ్డి మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహిస్తున్న చలో మెడికల్ కాలేజీ కార్యక్రమంలో పాల్గొనేందుకు మార్కాపురం తరలిరావాలని సూచించారు. జగనన్న ప్రభుత్వంలో నిర్మించిన మెడికల్ కాలేజీలను ప్రారంభిస్తే ఆయనకు ఎక్కడ మంచి పేరు వస్తుందోనన్న అక్కసుతో వాటిని అందుబాటులోకి తీసుకురాకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ఇప్పటికే పేద విద్యార్థులు వందలాది మెడికల్ సీట్లు కోల్పోయి ఎంతో నష్టపోయారన్నారు. జగనన్న చేసిన మంచి పనులను కూటమి ప్రభుత్వం ఎంతోకాలం కప్పిపుచ్చలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులను జనం ముందు ఉంచేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. మార్కాపురంలోని మెడికల్ కాలేజీని సందర్శించేందుకు జిల్లా నలుమూలల నుంచి విద్యార్థి, యువజన సంఘాలు, వైఎస్సార్ సీపీ నేతలు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

పేదలకు అణగదొక్కడం దారుణం

పేద ప్రజలు అన్ని విధాలుగా అభ్యున్నతి సాధించేందుకు జగనన్న ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడితే.. నేడు కూటమి ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేయాలి కానీ వారిని అణగదొక్కే ప్రయత్నాలు చేయడం దారుణన్నారు. విద్యార్థులకు కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ఒక్కొక్కటిగా బహిర్గతం చేస్తామన్నారు. పేద ప్రజలకు వైద్య విద్య అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా జగనన్న ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోగా వాటిని కాలరాసేందుకు కూటమి ప్రభుత్వం దుష్ట ఆలోచనలు చేస్తోందన్నారు. కాలేజీ ప్రైవేటుపరం చేయడం వల్ల వైద్య విద్య పేదలకు అందని ద్రాక్షలా మారుతుందన్నారు. పేదవారిలో డాక్టర్లు అయ్యే అవకాశాలు పూర్తిగా తగ్గిపోతాయన్నారు. వైద్య విద్యార్థులను కూటమి ప్రభుత్వం మోసగిస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గిద్దలూరు మండల కన్వీనర్ బత్తెం ఓబులరావు, పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు మానం బాలిరెడ్డి, నాయకులు పాలుగుళ్ల నరసింహారెడ్డి, గుల్లా రామకృష్ణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, స్వామిరంగారెడ్డి, మానం రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీ సందర్శన



అన్నా రాంబాబు

మార్కాపురం: మార్కాపురం మండలం రాయవరం వద్ద ఉన్న మెడికల్ కాలేజీని శుక్రవారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి సందర్శిస్తున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు తెలిపారు. యువజన, విద్యార్థి విభాగాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్మించి నిర్వహించాలని, పీపీపీ విధానం వద్దని తెలిపారు. మెడికల్ కాలేజీ ప్రైవేటు పరం చేయకుండా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వైఎస్సార్ సీపీ కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మిస్తేనే ఈ ప్రాంత ప్రజలకు మెడికల్ సేవలు అందుతాయన్నారు. పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని తెలిపారు.

ఆహార సలహా సంఘాలు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

బేస్తవారిపేట: ఆహార సలహా సంఘాల ఏర్పాటుపై మీనమేషాలు లెక్కిస్తున్న పాలకుల్లో కదలిక వచ్చింది. ప్రభుత్వ చౌక ధరల దుకాణాల్లో నిత్యావసర సరుకుల పంపిణీలో అక్రమాలను అరికట్టడంతోపాటు కార్డుదారులకు సజావుగా పంపిణీ చేసేందుకు ఉపయోగపడే ఆహార సలహా సంఘ సమావేశాలను గిద్దలూరు నియోజకవర్గంలో ఏడాదిన్నర కాలంగా నిర్వహించలేదు. ఈ విషయమై జూలై 31వ తేదీన 'సలహాలు నిల్లు.. తనిఖీలకు చెల్లు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి 15 రోజుల క్రితం కలెక్టర్ స్పందించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కమిటీ సభ్యులను యుద్ధప్రాతిపదికన నియమించారు. ప్రస్తుతం గత మూడు రోజులుగా నియోజకవర్గంలోని బేస్తవారిపేట, కంభం, కొమరోలు మండలాల్లో ఆహార సలహా సంఘాల సమావేశాలు నిర్వహించారు.



సాక్షి

సలహాలు నిల్లు.. తనిఖీలకు చెల్లు!

'సాక్షి'లో ప్రచురితమైన కథనం

ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న పీడీ శ్రీనివాస ప్రసాద్

కంభం: ఇంటి నిర్మాణాలు వేగంగా పూర్తి చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని గృహనిర్మాణ సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.శ్రీనివాస ప్రసాద్ సూచించారు. మండలంలోని చిన్నకంభం లేఅవుట్‌లో నిర్మాణంలో ఉన్న గృహాలను గురువారం ఆయన పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి గృహాలను త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల అసిస్టెంట్ ఇంజినీర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లతో ఇళ్ల నిర్మాణ పురోగతిపై సమీక్షించారు. డిసెంబర్‌లోగా అన్ని ఇళ్లు పూర్తయ్యేలా చూడాలన్నారు. మార్చి అనంతరం నిధులన్నీ ఆగిపోతాయని ప్రస్తుతం పీఎంఏవై 1.0 కింద ఉన్న ఇళ్లన్నీ డిసెంబర్‌లో పూర్తి కావాలన్నారు. అంగీకార్ 2025పై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మార్కాపురం ఈఈ పవన్ కుమార్, గిద్దలూరు డీఈఈ ఖదీర్ బాషా, ఎంపీడీఓ వీరభద్రాచారి, హౌసింగ్ ఏఈలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

దరిమడుగులో పోలేరమ్మకు పూజలు



ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మ తల్లి



అమ్మవారికి పొంగళ్లు తీసుకెళ్తున్న మహిళలు

- కుంకుమ బండ్లతో ఊరేగింపు

మార్కాపురం: మండలంలోని దరిమడుగు గ్రామంలో పోలేరమ్మ తల్లి దేవస్థానంలో పోలేరమ్మకు మహాలయ మాసం సందర్భంగా గురువారం భక్తులు కుంకుమ బండ్లు కట్టి పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యంగా సమర్పించారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు



పొదిలిలో నినాదాలు చేస్తున్న మున్సిపల్ కార్మికులు

గిద్దలూరు రూరల్: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు టి.ఆవులయ్య డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులకు పదవీ విరమణ ప్రయోజనాలు కల్పించాలని, వయోపరిమితి 62 సంవత్సరాలకు పెంచాలని, రిటైర్ అయిన కార్మికుల కుటుంబంలో అర్హతను బట్టి ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, పనిచేస్తు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.7 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు మున్సిపల్ కార్మికులకు వర్తింపజేయాలన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలు పట్టించుకోని ప్రభుత్వాలు ఎక్కువ కాలం అధికారంలో ఉండలేవన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 23వ తేదీ చలో విజయవాడ కార్యక్రమం పెద్ద ఎత్తున తలపెట్టనున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికుల సంఘ నాయకులు ఐ.చంటియ్య, పాపయ్య, రంగయ్య, ప్రవీణ్‌కుమార్, కన్నయ్య, మధు పాల్గొన్నారు.

పొదిలిలో మున్సిపల్ కార్మికుల ధర్నా

పొదిలి: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మికులు గురువారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బండి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. గతంలో సమ్మె కాలంలో కార్మికులకు ఇచ్చిన హామీలను నేటికీ నెరవేర్చలేదన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, వయోపరిమితి 62 ఏళ్లకు పెంచాలని, కుటుంబంలో అర్హత ఉన్న వారికి ఉద్యోగం కల్పించాలని, ప్రమాదవశాత్తూ మృతి చెందితే రూ.7 లక్షల ఎక్స్‌గ్రేషియా, మట్టిఖర్చులకు రూ.20 వేలు ఇస్తామన్న హామీలపై జీఓ ఇచ్చి అమలు చేయాలన్నారు. సమ్మెకాలపు జీతంతో పాటు, మూడు నెలల వేతనాన్ని వెంటనే మంజూరు చేయాలన్నారు. లేదంటే ఈనెల 23న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ధర్నాలో యూనియన్ నాయకులు డి.సుబ్బయ్య, కేవీ నరసింహం, జి.నాగేశ్వరరావు, బి.కోటేశ్వరమ్మ, పి.నాగేంద్రం, ఎస్.జార్జి, సీహెచ్ నాగరత్నం, మేరీ, చిన్నక్క, టి.బుజ్జి, హజరత్తమ్మ, బైరాగి అంజమ్మ, యెహోను, ఏడుకొండలు, చిన్నయ్య, పోలేరమ్మ తదితరులు పాల్గొన్నారు.

12వ పీఆర్‌సీ వెంటనే ప్రకటించాలి



మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

మార్కాపురం టౌన్: మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులందరికీ 12వ పీఆర్‌సీ అమలు చేసి జీతం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ డిమాండ్ చేశారు. గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో లక్షలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులతోపాటు ఒప్పంద కార్మికులు 12వ పీఆర్సీ కోసం ఎదురుచూస్తున్నారన్నారు. 11వ పీఆర్‌సీ గడువు పూర్తయి 2 సంవత్సరాలు అవుతున్నా ఇంత వరకు 12వ పీఆర్‌సీ కమిటీని వేయలేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీల్లో సంవత్సరాలుగా పనిచేస్తున్న ఎన్ఎంఆర్, బదిలీ, కోవిడ్ కార్మికులకు సమానపనికి సమాన వేతనం చెల్లించకుండా వెట్టిచాకిరీ చేయిస్తున్నారన్నారు. వీరితోపాటు పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు రూ.21 వేలు చెల్లిస్తూ.. వీరికి మాత్రం రూ.13 వేల లోపు విదిల్చి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఈనెల 23న చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కె.సుబ్బరాయుడు, హరి, చెన్నరాయుడు, చెన్నకేశవులు, శేషిరెడ్డి, కనకయ్య, అల్లూరయ్య, శేఖర్, ఇమాంసా, శ్రీను, సమ్మద్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

బయో గ్యాస్ ప్లాంటుకు భూమి పరిశీలన



భూములను పరిశీలిస్తున్న జేసీ, పక్కన సబ్‌కలెక్టర్, అధికారులు

తర్లుపాడు: మండలంలోని మంగళకుంటలో సీబీజీ ప్లాంటు ఏర్పాటుకు జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ భూమిని పరిశీలించారు. సర్వే నంబరు 86/4లో 150 ఎకరాల ప్రభుత్వ భూమిని లీజు ప్రాతిపదికన కేటాయించనున్నట్లు జేసీ తెలిపారు. ఆయన వెంట సబ్‌కలెక్టర్ త్రివినాగ్, తహసీల్దార్ కిశోర్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం



ఉత్తమ ఉద్యోగులను సత్కరిస్తున్న కమిషనర్

గిద్దలూరు రూరల్: ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని స్థానిక మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు పేర్కొన్నారు. పట్టణంలోని ఆర్టీసీ డిపో పరిధిలో ఉత్తమ సేవలు అందించిన డ్రైవర్లు, కండక్టర్లకు గురువారం ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికులను గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చడం ద్వారా ఆర్టీసీపై ప్రజలకు ఉన్న విశ్వాసాన్ని నిలబెట్టాలని ఆకాంక్షించారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా ఒంగోలు అమృత వైద్యశాల అందజేసిన దివ్యాంగుల వీల్‌చైర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో డిపో ఇన్‌చార్జి డీఎం మౌనిక, ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీల్లో జెడ్పీ బాలికల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు

మార్కాపురం టౌన్: పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో సర్వశిక్ష, వారధి సంస్థలు సంయుక్తంగా నిర్వహించిన యాన్యువల్ స్టూడెంట్స్ కాంపిటీషన్ 2025లో జిల్లా స్థాయి వక్తృత్వ పోటీల్లో జెడ్పీ బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు ప్రథమ బహుమతి సాధించినట్లు హెచ్ఎం శ్రీదేవి గురువారం తెలిపారు. ‘ఐక్యరాజ్య సమితియొక్క స్థిరమైన అభివృద్ధి, లక్ష్యాలు–భారతదేశ అభివృద్ధికి సంబంధించినవి కావు’ అనే అంశంపై నిర్వహించిన పోటీలో పదో తరగతి విద్యార్థిని ఖాశింబి, ‘విద్యార్థుల అభ్యాసానికి సోషల్ మీడియా ఉపయోగాలు’ అనే అంశంపై పోటీలో 9వ తరగతి విద్యార్థి డి.శివ వసంత ప్రథమ స్థానం సాధించి ప్రతిభ చాటారని వివరించారు. వీరు డీఈఓ కిరణ్‌కుమార్, జిల్లా సైన్సు అధికారి రమేష్ చేతులమీదుగా ప్రశంసా పత్రం, బహుమతులు అందుకున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

112 మందికి వైద్య పరీక్షలు

బేస్తవారిపేట: స్థానిక ఇస్లాంపేటలో స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బేస్తవారిపేట పీహెచ్‌సీ వైద్యాధికారి టి.కావ్య ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. 112 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. రక్త పరీక్షలు, హిమోగ్లోబిన్ పరీక్షలు, క్యాన్సర్ పరీక్షలు చేసిన అనంతరం మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీడీపీఓ కె.కుమారి, సీహెచ్ఓ జె.తులసీ ప్రసాదరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పొదిలి: స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్‌లో గురువారం మహిళలకు డాక్టర్ శరత్‌చంద్ర, గైనకాలజిస్టు డాక్టర్ శివపార్వతి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అక్టోబర్ 2వ తేదీ వరకు మహిళలకు ప్రత్యేకంగా వైద్య పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సీడీపీఓ సుధామారుతి సూచించారు.

కొనకనమిట్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో అక్టోబర్ 2వ తేదీ వరకు మహిళలకు ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు గొట్లగట్టు పీహెచ్‌సీ డాక్టర్లు ఎస్పీ.బాలయ్య, నరేంద్ర తెలిపారు. గురువారం గొట్లగట్టులో పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎంపీహెచ్ఈఓ నారాయణరెడ్డి, ఎంపీహెచ్ఎస్ జె.వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హోరాహోరీగా స్కూల్ గేమ్స్



కంభం : పరుగు పందెంలో పాల్గొన్న బాలికలు



ఖోఖో ఆడుతున్న బాలికలు



హోరాహోరీగా బాలికల కబడ్డీ పోరు



గొట్లగట్టులో కబడ్డీలో తలపడుతున్న బాలికలు

కంభం: స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాల క్రీడా మైదానంలో మండల స్థాయి క్రీడల పోటీలు రెండో రోజు గురువారం హోరాహోరీగా సాగాయి. పరుగు పందెం బాలికల విభాగంలో రావిపాడు, టెన్నిస్‌లో కంభం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు సత్తాచాటారు. మండల స్థాయి విజేతలను డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ఎంఈఓ అబ్దుల్ సత్తార్ తెలిపారు. కార్యక్రమంలో పీడీలు సుబ్రహ్మణ్యం, బషీర్, వెంకటేశ్వర్లు, మధుసుదన చారి, శ్రీనివాసులు, జయమ్మ, సునీల, తదితరులు పాల్గొన్నారు.

కొమరోలు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో గురువారం మండల స్థాయి క్రీడా పోటీలను ఎంపీపీ కామూరి అమూల్య ప్రారంభించారు. క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందని, మొబైల్‌కు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓలు కె.వెంకటేశ్వర్లు, బొర్రా వెంకటరత్నం, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: మండల స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలను బుధవారం గొట్లగట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల, వెలుగొండ గురుకుల పాఠశాల మైదానంలో ప్రారంభించారు. కొనకనమిట్ల, గొట్లగట్టు, చినారికట్ల, పెదారికట్ల, మర్రిపాలెం, రేగడపల్లి, గొట్లగట్టు కేజీబీవీ నుంచి విద్యార్థులు పాల్గొనగా వారికి కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, బ్యాట్‌మెంటన్, యోగా, చెస్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. పోటీలలో ఆయా పాఠశాలల క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీలను ఎంఈఓ–2 నరసింహారావు పర్యవేక్షించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఆదినారాయణ, పలు పాఠశాలల పీఈటీలు ఉప్పుటూరి శ్రీనివాసులు, సుఖునాభి, వనజలత, పెద్దన్న, పాఠశాల కమిటి సభ్యులు పరిటాల సుబ్బయ్య, పొదిలి తిరుపతయ్య, వేముల శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక అభివృద్ధి

బేస్తవారిపేట: క్రీడలతో శారీరక అభివృద్ధితోపాటు మానసికాభివృద్ధి జరుగుతుందని ఎంఈఓలు ఎస్.మధుసూదన్‌రెడ్డి, సీహెచ్ రమణారెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్లో అండర్–14, అండర్–17 విభాగాల్లో క్రీడాపోటీలను ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. శుక్రవారం అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫిజికల్ డైరెక్టర్లు తెలిపారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ పీవీ రమణారెడ్డి, పీఈటీలు పాల్గొన్నారు.